ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

మే 2017

₹10



## అంతరాలను బాపిన ఆదిశేషుని అవతారం

## లోపలి పేజీల్లో...


6 సంపాదకీయం
అంతరాలను బాపిన ఆదిశేషుని అవతారం

8 గోరుముద్ద
మనమెంత స్మార్ట్!

9 ఆంగ్లంతో ఆటలు

10 పలికెడిది భాగవతం
ఆత్మస్తుతి పరనిందలు దోషము

12 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

13 పారమార్థిక పథంలో...

14 రామకృష్ణ భక్తి సూత్రాలు

15 అన్నమయ్య పదామృతం
ఆంజనేయ... అనిలజ... హనుమంతా!

16 పరమపదానికి రాజమార్గం
త్రికరణశుద్ధి

18 తనయుని మార్చిన తండ్రిబోధ

20 శ్రమజీవికి శని సుదూరం

21 ధీరవాణి
సజీవదైవాలను సేవించండి!

22 అనుష్ఠాన వేదాంతం

24 మీకు తెలుసా?
ఉద్యోగం.. సద్యోగం..

26 పల్లెకు పోదాం...

28 బుద్ధుడు నడచిన భూమిపై...

30 బాధ నుంచి పుట్టిన భావాంజలి గీతాంజలి

33 ప్రగతి పథంలో కార్మికులు కాగడాలు

35 ఒక కథ చెబుతా...
అపాయంలో ఉపాయం!

36 భగవద్గీత - సద్గుణ సుధ
తప్పించుకు తిరుగువాడు...

38 బొమ్మల కథ
బహుజన హితం... బుద్ధుని జీవితం

42 షోడశీపూజ


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

### శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

* 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోగలరు.
* మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
* మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
* ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ... – సర్క్యులేషన్ మేనేజర్


KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

# అంతరాలను బాపిన



ఒకరోజు ఓ వ్యక్తి వీధిలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఒక బాలుడు పరుగున వచ్చి ఆయన పాదాలపై పడి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఇదంతా వీధిలో నిలబడి చూస్తున్న అమ్మగార్లూ, అయ్యవార్లూ ముక్కుమీద వేలేసుకున్నారు, ఏదో మహాపరాధం జరిగిపోయినట్లు. అవును, అది మహాపరాధమే! మహాఘోరకృత్యమే! ఎందుకంటే, నిమ్నజాతివారిని చూస్తేచాలు గంగా స్నానం చేయాలనే మూర్ఖపు భావాలున్న రోజులవి; పంచములను తాకితేచాలు మహాపాతకం అంటుకుంటుందనే పరమ ఛాందస భావాలు రాజ్యమేలుతున్న కాలమది; శూద్రులు నడిచే దారిలో నడిస్తే నరకానికి పోతామనే మూఢనమ్మకాలు పాతుకుపోయిన రోజులవి; అధములనీ, అంటరానివారనీ కనుచూపుమేరలోనైనా కనపడనీయకుండా సాటిమనిషిని ఊరి అవతల ఉంచే సంకుచితభావాలు వేళ్ళూనుకున్న రోజులవి; దేవాలయంలోకి ఆవులు, ఏనుగులు వెళ్ళవచ్చుగానీ, పంచమజాతి అని ముద్రవేసిన మనుషులకు మాత్రం ప్రవేశంలేదనే అజ్ఞానాంధకారం గాఢంగా అలుముకున్న రోజులవి; ఆలయంలో దైవానికి వేదమంత్రాలతో అభిషేకం, బయట సజీవదైవాలకు శాపనార్థాలతో అర్చన జరుగుతున్న రోజులవి...

ఈ విషపుఛాయలేవీపడని అమృత హృదయుడు ఆ చిన్నారి బాలుడు. దారిన పోయిన దానయ్యకు దండం పెట్టిన ఆ బాలుణ్ణి అక్కడ గుమిగూడిన జనమంతా 'ఏమయ్యా! ఏమిటి ఈ వెర్రిచేష్టలు! నువ్వు అగ్రకులం వాడివై ఉండి, ఒక అధమకులం వాడి ముందు సాగిలపడి నమస్కరిస్తావా? ఎంత అవమానం, ఎంత సిగ్గుచేటు...' అంటూ మందలించారు. అతడు ఇంకా పిన్న వయస్కుడే కాబట్టి కులం నుండో, ఊరి నుండో వెలివేయకుండా వదిలేసినందుకు వారి సహృదయాన్ని వేనోళ్ళ కీర్తించాలి మరి.

"నేనేం తప్పు చేశానని వీరంతా నన్ను మందలిస్తున్నారు! భక్తి, ప్రేమ, క్షమ, దయ, వినయం, నిస్వార్థం, ప్రశాంతత ఉన్నవారెవరైనా బ్రాహ్మణులే కదా! బ్రాహ్మణత్వం పుట్టుకతో వస్తుందా! ఈ సద్గుణాలు పుట్టడంతో వస్తుందా!" అనే ప్రశ్న తలెత్తింది ఆ బాలుడిలో. ఆ బాలుడే మద్రాసులోని పార్థసారథి స్వామి అనుగ్రహంతో, ఆదిశేషుని అంశతో కేశవాచార్యులు, కాంతిమతి అనే పుణ్య దంపతులకు క్రీ.శ. 1017లో శ్రీపెరంబుదూర్‌లో జన్మించిన రామానుజాచార్యులు. అన్న శ్రీరాముని సేవలో తరించిన అనుజుడైన లక్ష్మణుని సుగుణాలను పుణికిపుచ్చుకున్న ఆ బాలుడు రామానుజుడిగా అవతరించి ఆ అనంతశయనుని సేవకే తన జీవితాన్ని అర్పించాడు.

ఆనాడు శ్రీపెరంబుదూర్ వాసులు రామానుజుణ్ణి ఊరి నుండి వెలివేయకపోయినా భగవదనుగ్రహమో, పరిస్థితుల ప్రభావమో అతణ్ణి ఉన్న ఊరు విడచి కాంచీపురానికి పయనమయ్యేలా చేసాయి. కంచిలోని వరదరాజ స్వామి ఆలయ సమీపంలో నివాసం ఏర్పరచుకున్నాడు. ఒకరోజు వరదరాజ స్వామిని దర్శించుకొని వస్తుండగా తాను చిన్నప్పుడు పాదాభివందనం చేసిన మహానుభావుడు ఎదురుపడ్డాడు. ఆయనే కాంచీపూర్ణుడు. వరదరాజ స్వామితో రోజూ ప్రత్యక్షంగా మాట్లాడే పరమ భక్తుడు. వరదరాజ స్వామి ఈ పరమ భక్తుణ్ణి పలకరించకుండా అమ్మవారితో కూడా మాట్లాడేవాడు కాదట. సమాజం దృష్టిలో అధమకులస్థునిగా పరిగణింపబడినప్పటికీ, పరమాత్ముడు మాత్రం ఈ భక్తాగ్రేసరుడికి అగ్రస్థానమిచ్చాడంటే ఈ కాంచీపూర్ణుడి విశిష్టత నోటిమాటలు, రాతకోతలతో వర్ణించలేమని వేరే చెప్పనవసరం లేదు.

సకలగుణ నిలయుడు, వరదరాజ స్వామి ప్రియభక్తుడు అయిన కాంచీపూర్ణుడి కన్నా ఉత్తమ గురువు ఇంకెవరుంటారని తలచిన రామానుజులు తనను శిష్యునిగా స్వీకరించమని కోరాడు. అందుకు కాంచీపూర్ణుడు తిరస్కరించాడు. రామానుజుడు ఎన్నోవిధాల అతణ్ణి ఒప్పించడానికి ప్రయత్నించాడు. చివరికి కాంచీపూర్ణుడు రామానుజుడితో 'నాయనా! నీవు కొన్ని రోజులు యాదవప్రకాశుని వద్ద శిష్యరికం చేయాలనీ; ఆ తరువాత శ్రీరంగంలో యామునాచార్యుని సన్నిధి చేరాల్సి ఉంటుందనీ; ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక కార్యాలు

చేయాల్సి ఉంటుందనీ వరదరాజ స్వామి నాతో చెప్పాడు' అని అనునయించాడు. కాంచీపూర్ణుడి ఆనతి మేరకు రామానుజుడు యాదవప్రకాశుని వద్ద శిష్యునిగా శాస్త్రాధ్యయనం ప్రారంభించాడు. గురువు చేసిన వక్రభాష్యాన్ని తరచూ ఖండిస్తూ వచ్చాడు రామానుజుడు. ఒకరోజు యాదవప్రకాశుడు 'సర్వం ఖల్విదం బ్రహ్మ – అంతా బ్రహ్మమయమే! ఈ సృష్టిలో బ్రహ్మం తప్ప వేరేదీ లేదు' అంటూ వివరించసాగాడు. అందుకు రామానుజుడు 'విశ్వానికీ, బ్రహ్మానికీ సంబంధం ఉంది. కానీ ఆ రెండూ ఒక్కటి కాదు. దేని విశిష్టత దానికి ఉంది. అంతా బ్రహ్మమయమే అయినప్పుడు, బ్రహ్మం తప్ప వేరేమీ లేనప్పుడు కులం పేరుతో మనుషుల మధ్య అధికులనీ, అధములనీ వేర్పాటు ఎందుకు?' అని ప్రశ్నించాడు. రామానుజుని ఎదురు ప్రశ్నకు ఆగ్రహోదగ్రుడైన యాదవప్రకాశుడు అతణ్ణి గురుకులం నుండి వెళ్ళగొట్టాడు. ఆ తరువాత రామానుజులు

# ఆదిశేషుని అవతారం

యామునాచార్యుల పిలుపుమేరకు శ్రీరంగం చేరుకొన్నారు. ఆయన అభిమతానుసారం విశిష్టాద్వైత వ్యాప్తికి అంకితమయ్యారు.

అద్వైతవేదాంతం ప్రకారం – 'ఉన్నది ఒక్కటే, రెండు కాదు. పరబ్రహ్మ తప్ప మిగిలినదంతా మిథ్య'. విశిష్టాద్వైతం ప్రకారం – 'సర్వాంతర్యామి అయిన పరమాత్మ (విష్ణువు) అంశయే జీవాత్మ. అయినప్పటికీ ఆ రెండూ పరిమాణంలో, ప్రభావంలో సమానం కాదు. వాటికి విశిష్టగుణాలు ఉన్నాయి. జీవుడు, పరమాత్మను భక్తి, శరణాగతి, సేవల ద్వారా పొందవచ్చు'.

'అహం బ్రహ్మాస్మి – నేనే బ్రహ్మను' అని అనర్థులంతా ఆపాదించుకోవడం వల్ల; అంతా మాయ, అంతా భ్రాంతి, అంతా మిథ్య... అంటూ మెట్ట వేదాంతం ప్రబలుతుండడం వల్ల సాటి మనుషుల కన్నీళ్ళు తుడిచేవారు కరువయ్యారు; సమాజంలో అధిక, అధమ వర్ణాల తారతమ్యం పెచ్చుపెరిగిపోయింది; పండితులు, పామరులను అణగద్రొక్కే పరిస్థితి అధికమై పోయింది... ఇలాంటి రుగ్మతలతో సమాజం పీడింపబడుతున్న తరుణమది.

సమాజంలో వర్ణవివక్షత, అంటరానితనం, మూఢాచారాలు, దురాచారాలు, నా ముక్తి, నా సుఖం అనే స్వార్థ భావాలను రూపుమాపి సంఘసంస్కరణల కోసం, సమాజ శ్రేయస్సు కోసం, మానవాభ్యుదయం కోసం పరిశ్రమించిన మహాచార్యుడు, దీనజనోద్ధరణ కోసం పరితపించిన విశాల హృదయుడు శ్రీరామానుజులు.

శ్రీరామానుజుడి మహోన్నత హృదయాన్ని ఆవిష్కరించే కొన్ని సంఘటనలను తెలుసుకొందాం :

❖ అగ్రవర్ణంవారు మహాపూర్ణుణ్ణి వెలివేశారన్న వార్త రామానుజుడికి తెలిసింది. వెంటనే ఆయన మహాపూర్ణుని వద్దకు వెళ్ళి విచారించగా 'మహాపూర్ణుడు ఒక పంచముడికి వేదోక్తంగా అంత్యక్రియలు జరిపినందుకతణ్ణి వెలివేశార'ని తెలిసింది. ఇది అధర్మమెలా అవుతుంది? శ్రీరాముడు జటాయువుకి వైదికకర్మ చేశాడు. మరి అది ధర్మమైనప్పుడు, మహాపూర్ణుడు చేసింది అధర్మమెలా అవుతుంది? ఉత్తముల అడుగుజాడల్ని అనుసరించ డమే మన కర్తవ్యం కదా! ఆ మహాపూర్ణుడి మహోన్నత వ్యక్తిత్వానికి ప్రణమిల్లారు రామానుజులు. అక్కడున్న పండిత వర్గమంతా అవమానంతో తలదించుకున్నారు.

❖ గోష్ఠిపూర్ణుడి నుండి 'ఓం నమో నారాయణాయ' అష్టాక్షరి మంత్రం స్వీకరించాలని రామానుజులు ఎన్నోసార్లు ప్రయత్నించారు. చివరికి గోష్ఠిపూర్ణుడు రామానుజునికి అష్టాక్షరి మంత్రం ప్రదానం చేశాడు. కానీ ఈ మంత్రాన్ని ఎవ్వరికీ చెప్పకూడదు. ఒకవేళ చెబితే నరకానికి పోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. రామానుజులు సౌమ్యనారాయణాలయ గోపురం ఎక్కి ఊరి ప్రజలందరినీ పిలిచి అష్టాక్షరి మంత్రాన్ని అందరితో ఉచ్చరింపజేశారు. ఈ విషయం తెలిసిన గోష్ఠిపూర్ణుడు ఆగ్రహించగా 'ఈ పావన మంత్రం ఉచ్చరించడం వల్ల ఎంతోమంది తరించారు. అంతేచాలు, ఇక నేను నరకానికి వెళ్ళడానికి సిద్ధం స్వామీ!' అని రామానుజులు నిర్భయంగా వెల్లడించారు. రామానుజుని మహోన్నత హృదయానికి చలించిపోయాడు గోష్ఠిపూర్ణుడు.

❖ శ్రీరంగనాథాలయంలో అర్చకులు ఆలయాన్ని అంగడిగా మార్చారు. అక్రమార్జన అధికమైంది. రామానుజులు శ్రీరంగక్షేత్ర నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. ఆలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి ప్రత్యేక నియమ నిబంధనలను ఏర్పరచారు. అప్పటి నుండి అర్చకుల అక్రమార్జనకు తెరపడింది. ఆ అక్కసుతో అర్చకులంతా రామానుజుల్ని హతమార్చాలని పన్నాగం పన్నారు. ఆయన భోజనంలో విషం కలిపి ఇవ్వడానికి ఒక ఇల్లాలిని ఒప్పించారు. ఆమె రామానుజులకు భోజనం వడ్డించింది. ఆయన తినబోతుండగా ఆ మాతృహృదయం తల్లడిల్లింది. వెంటనే ఆయన్ని తినవద్దని వారించి, అందులో విషం కలిపినట్లు తెలిపింది. రామానుజునికి విషయమంతా తెలిసిపోయిందని అర్చకులు క్షమాపణ వేడారు. అప్పుడు ఆయన "క్షమాపణ కోరాల్సింది నన్ను కాదు. అమాయకురాలైన ఆ మాతృమూర్తిని ఈ ఘోరకృత్యానికి పాల్పడేలా చేశారు. ఇది మహాపాపం. ముందు ఆమె పాదాలపై పడి క్షమాపణ వేడండి" అని అన్నారు. రామానుజుల మహోన్నత సంస్కారానికి ప్రభావితులైన అర్చకులంతా ఆనాటి నుండి అక్రమమార్గాలను వీడి అర్చనా విధులను సక్రమంగా కొనసాగించసాగారు.

*(మిగతా 32వ పేజీలో...)*

ప్రేమ, కరుణ, ఆత్మబలం, దీనజనోద్ధరణ కోసం తపన లాంటి విశేషగుణాలతో విరాజిల్లుతూ ధార్మిక, సామాజిక సంస్కరణలను గావించిన మహాచార్యులు శ్రీరామానుజులు - డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

## గోరుముద్ద - స్వామి సుప్రియానంద

# మనమెంత స్మార్ట్ !

నేడు 'స్మార్ట్‌ఫోన్' అందరికీ అందుబాటులో ఉంది. సాంకేతికంగా ప్రపంచమంతా మన చేతిలోనే ఉంది. ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇవి మన వివేకాన్ని పెంచుతున్నాయా? మన జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాయా?.... ఇవి నిస్సందేహంగా మన సమయాన్ని ఆదాచేయడంతో పాటు మన జ్ఞానాన్ని పెంపొందించేవే! కానీ మనం మన విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించకపోతే ఇవి మనకు విజ్ఞానాన్ని కలిగించడం అటుంచి, తీవ్ర నష్టాన్ని కల్గిస్తాయి. పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇచ్చేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలి. వారికి ఏది మంచో, ఏది చెడో తెలియదు కాబట్టి మనమే తెలియజేయాలి.



దేవలోకంలో మన గురించి ఏమనుకుంటున్నారో ఒకసారి చూద్దాం: ఒకసారి దేవేంద్రుడు, బృహస్పతిని 'గురువర్యా! నేడు భూలోకంలో అందరూ స్మార్ట్‌ఫోన్‌తో బిజీగా కాలం గడుపుతున్నారు. కానీ ఎవరి ముఖంలో కూడా ఆనందం కనబడటం లేదు, ఎందువల్ల?' అని అడిగాడు. అందుకు బృహస్పతి 'దేవేంద్రా! మనం కూడా స్మార్ట్‌ఫోన్స్ ఉపయోగిస్తున్నాం. నీకు కడుపునొప్పి గురించి నిన్న ఒక మెయిల్ పంపించాను. దానిని నీవు చదివావా?' అని అడిగారు. దానికి ఇంద్రుడు 'నేను ఆ మెయిల్‌ను చదవలేదు, కానీ మిత్రులకు ఫార్వర్డ్ చేశాను' అని చెప్పాడు. అప్పుడు బృహస్పతి 'దేవేంద్రా! భూలోకవాసులలో కూడా ఇదే సమస్య. వాళ్ళు తమకు వచ్చిన సమాచారాన్ని చదవకుండానే ఇతరులకు ఫార్వర్డ్ చేస్తున్నారు. రోజూ అరగంట నడిస్తే ఆరోగ్యానికి మంచిదని వైద్యుడు చెబితే, దాన్ని ఆచరించకుండా ఆ విషయాన్ని ఫార్వర్డ్ చేయడంలోనే సమయాన్ని వృథా చేస్తున్నారు. మరీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎవరైనా ప్రమాదంలో ఉంటే వారిని రక్షించకుండా వీడియోలు తీయడంలో ఆనందపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి మనలోకంలో రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం మంచిదనుకుంటాను' అని ఇంద్రుడితో అన్నారు.

ప్రపంచం ఎలాగైతే మంచీచెడులతో నిండివుందో అలాగే సాంకేతికజ్ఞానం కూడా మంచీ చెడులతో నిండివుంది. దానిలో ఏది అనర్థమో, ఏది మనకు నష్టాన్ని కలిగిస్తుందో దాన్ని మన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి తొలగించాలి.

నేడు స్మార్ట్‌ఫోన్స్ ఉన్నవారు లేనివారిని హేళన చేస్తున్నారు. మనం వాటిని ఉపయోగిస్తూ బోల్తా పడితే ఇతరులు కూడా బోల్తా పడాలని అనుకుంటున్నారు. కొన్ని ఏళ్ళు వెనుకకు వెళ్తే గ్రామానికంతటికీ ఒకటో, రెండో ఫోన్‌లు ఉండేవి. ఆ తరువాత కాలంలో ఇంటికి ఒక ఫోన్ ఉండేది. అప్పుడు అందరూ ఒకదగ్గర చేరి మాట్లాడేవారు. దానివల్ల వారిమధ్య ప్రేమ, ఆప్యాయతలు పెంపొందేవి. నేడు ఒకరికి రెండు, మూడు ఫోన్‌లు ఉంటున్నాయి. ఎవరి మాటల్లో వారు ఉంటున్నారు. దానివల్ల మనుష్యుల మధ్య దూరం పెరుగుతుంది.

స్మార్ట్‌ఫోన్‌తో మనం ఏమి సాధించాం? ఏమి సాధించాలనుకుంటున్నాం? స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తూ మనం విజ్ఞానాన్ని పొందుతున్నామా? లేదా యాంత్రికంగా మారుతున్నామా? నేడు ఈ సాంకేతిక పరిజ్ఞానంతో మంచికన్నా చెడే ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. ఇది సరైనదేనా?

విచక్షణాజ్ఞానంలేని చురుకుదనం వ్యర్థం. ఏది మనకు అవసరం, ఏది అనవసరం అన్న విషయాన్ని స్మార్ట్‌ఫోన్ మనకు తెలియజేయదు. మనమే మన విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించి దాన్ని తెలుసుకుంటే స్మార్ట్‌ఫోన్ కంటే స్మార్ట్‌గా తయారవుతాం, లేకుంటే మూర్ఖులుగా తయారవుతాం. మన విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించకుండా కేవలం స్మార్ట్‌ఫోన్‌పైనే ఆధారపడితే నిప్పుతో చెలగాటం ఆడినట్లే! స్మార్ట్‌ఫోన్ ఉపయోగకరంగా ఎప్పుడు ఉంటుందంటే మనం దానికంటే స్మార్ట్‌గా ఉన్నప్పుడే! ❖

# ఆంగ్లంతో ఆటలు

-బ్రహ్మచారి శ్యామ్

స్వామి బ్రహ్మానంద (రాఖాల్) మహరాజ్‌కు అక్షరాలతో ఆటలు ఆడటమంటే చాలా ఇష్టం. ఒకరోజు రాత్రి స్వామి బ్రహ్మానంద మహరాజ్, స్వామి వరదానంద మహరాజ్‌తో కలసి **'ప్రాసపదాల పదనిసలు'** అనే ఆట ఆడుతున్నారు. ఇద్దరు కలసి ఆడే ఈ ఆటలో మొదటి వ్యక్తి ఒక పదాన్ని చెబుతాడు. రెండో వ్యక్తి ఆ పదానికి అంత్యప్రాస సరిపోయే విధంగా మరో పదం చెప్పాలి. ఉదాహరణకు రాఖాల్ మహరాజ్ 'క్రికెట్' అని చెప్పారు అనుకుందాం. అప్పుడు వరదానంద మహరాజ్ అంత్యప్రాస సరిపోయే విధంగా మరొక పదం చెప్పాలి. వరదానంద మహరాజ్ 'వికెట్' అని చెప్పారనుకుందాం. అప్పుడు ఇక బ్రహ్మానంద మహరాజ్ వంతు. మహరాజ్ అదే అంత్యప్రాస కలిగిన మరో పదం చెబితే అలా ఆట కొనసాగుతుంది. వరదానంద మహరాజ్ వంటగదిలో, రాఖాల్ మహరాజ్ వరండాలో కూర్చొని ఈ ఆట ఆడుతున్నారు. శాంభవానంద మహరాజ్ వీరిద్దరి మధ్య వార్తావాహకుడిగా పనిచేసి పదాలు అటూఇటూ చేరవేస్తున్నారు. ఏదో కొద్దిసేపట్లో ఆట అయిపోతుంది అని శాంభవానంద మహరాజ్ అనుకున్నారు. కానీ వారు ఆ ఆటను గంటన్నరకుపైగా కొనసాగించారు. చివరకు అలసిపోయిన వరదానంద మహరాజ్, 'It is late at night' అని చెప్పడం ద్వారా అప్పటికే బాగా రాత్రి అయిపోయిందని కూడా సూచించారు. శాంభవానంద మహరాజ్ అదేమాటను బ్రహ్మానంద మహరాజ్‌తో చెప్పారు. వరదానంద మహరాజ్ అంతరంగాన్ని గ్రహించిన రాఖాల్ మహరాజ్ 'Tell him good night' అని ముక్తాయింపుగా చెప్పి ఆటను ముగించారు.

అవి బ్రహ్మానంద మహరాజ్ మద్రాసు మఠంలో ఉంటున్న రోజులు. ఒకరోజు మధ్యాహ్నం సోదరి దేవమాత మఠ సందర్శనార్థం వచ్చారు. ఆమె ప్రధాన ద్వారం వద్దకు వచ్చేటప్పటికి పెద్దగా వర్షం మొదలైంది. సాధువులందరూ ఆ ప్రశాంత వాతావరణంలో ధ్యానమగ్నులై ఉంటారని ఆమె భావించారు. కానీ మఠంలోపలనుండి కోలాహలం వినరావడంతో ఆమె లోపలికి వెళ్ళారు. తీరా చూస్తే ఆశ్రమంలోని సాధువులు, బ్రహ్మచారులు ఒక ఆట ఆడుతూంటారు. ఆ ఆట పేరు **'అక్షరాలతో కుస్తీ, పదాలతో దోస్తీ'**. ఇద్దరు కలసి ఆడే ఆ ఆటలో ఒక పలకపై ముందుగా ఒకరు ఒక అక్షరాన్ని వ్రాస్తారు. రెండవ వ్యక్తి ఆ అక్షరానికి ముందుగానీ లేదా ఆ అక్షరం తర్వాతగానీ మరో అక్షరాన్ని వ్రాస్తారు. అలా వారు పదాలను అల్లుకుంటూ వెళ్తారు. ఎవరైతే తమవంతు వచ్చినప్పుడు అర్థవంతమైన పదాన్ని నిర్మించే విధంగా అక్షరాన్ని వ్రాయలేకపోతారో వారు ఓడిపోయినట్లు. కొత్తగా మఠంలో చేరిన బ్రహ్మచారులకు, యువ సన్న్యాసులకు ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో బ్రహ్మానంద మహరాజ్ ఈ ఆటను ప్రోత్సహించేవారు.

సోదరి దేవమాత ఆశ్రమానికి వచ్చే సమయానికి ఇద్దరు బ్రహ్మచారులు కలసి ఆడుతున్న ఆట రసకందాయంలో



పడింది. దాంతో ఆశ్రమంలోని మిగిలిన బ్రహ్మచారులు, స్వాములు అందరు కూడా రెండు బృందాలుగా మారి ఇరువైపుల వారికి సూచనలు ఇవ్వసాగారు. బ్రహ్మానంద మహరాజ్ ఒక బృందం వారికి ఒక అక్షరాన్ని సూచించారు. కానీ ఆ పలకపై ఉన్న అక్షరాల కూర్పుతో ఏ పదం సాధ్యమో ఎవరికీ అంతుపట్టలేదు. దాంతో రెండో బృందంవారు సోదరి దేవమాతను ఆశ్రయించారు. ఆమె కూడా ఆ అక్షరాల కూర్పు చూసి దానితో ఏ పదమూ సాధ్యంకాదని తేల్చేసారు. కానీ రాఖాల్ మహరాజ్ మాత్రం ఆ అక్షరాల కూర్పుకు మరో అక్షరాన్ని జోడించి, వెళ్ళి డిక్షనరీ చూడు అని అన్నారు. వారంతా డిక్షనరీలో ఆ పదాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. బ్రహ్మానంద మహరాజ్ స్వయంగా ఆంగ్లంలో ఎక్కువ రచనలు చేయకపోయినా, బహిరంగ ఉపన్యాసాలు చేయకపోయినా వారి ఆంగ్లభాషా పరిజ్ఞానం అమోఘం.! ❖

**గురువును, భక్తుడిని వర్ణాలకు అతీతంగా దర్శించు. వారు కులాతీతులు. వారు పరమాత్మకులజులు. పరమాత్మ సేవకు అంకితమైనవారే నిజమైన భక్తులు.** - *శ్రీరామానుజులు*



## పలికెడిది భాగవతం

అర్హుడిని కాను. ఇక ముందు నాలో సద్గుణాలు కనిపిస్తే అప్పుడు కీర్తించండి! అయితే భగవంతుడైన శ్రీమహావిష్ణువు సుగుణాలు సర్వలోకాల్లో సుప్రసిద్ధాలు. ముందు ఆయన గుణగానం చేయండి. అన్ని స్తోత్రాలకు అన్ని విధాలా అర్హుడైన వాడు అతడే! అంతేకాదు, పైస్థానంలో ఉన్నవారు సామాన్యులైనా, వారికి మహాత్ముల లక్షణాలను ఆపాదించి మీలాంటి వారు పొగుడుతారు. కానీ లేని గుణాలను ఉన్నట్లు ఎలా భావిస్తాం! ఎదుటివారి మాటలు విని ఏ వ్యక్తి అయినా తనలో లేని గొప్పతనాన్ని ఉన్నట్లు భ్రమపడితే అలాంటి మందమతిని చూసి సభ్యులు, సహచరులు లోలోన నవ్వుకుంటారు. అనతికాలంలోనే అతడు అభాసుపాలు కాక తప్పదు” అని వివరించారు. తదనంతరం...

# ఆత్మస్తుతి పరనిందలు దోషము

– స్వామి జ్ఞానదానంద

శ్రీమన్నారాయణుడి అంశతో పృథువు, లక్ష్మీదేవి అంశతో ఆయనకు అర్ధాంగిగా అర్చీ ఆవిర్భవించారు. అనంతరం బ్రాహ్మణులు పృథువుకు చక్రవర్తిగా రాజ్యాభిషేకం చేశారు. సర్వాలంకార భూషితులైన ఆ రాజదంపతులకు శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రాన్ని, పరమేశ్వరుడు అర్ధచంద్రాకార ఒరతో కూడిన కరవాలాన్నీ, సరస్వతీ దేవి ముత్యాల హారాన్నీ, లక్ష్మీదేవి సిరిసంపదలనూ, కుబేరుడు స్వర్ణసింహాసనాన్నీ, వాయుదేవుడు స్వచ్ఛమైన ధవళ వింజామరలనూ, ధర్మదేవత పుష్పమాలికలనూ, ఇంద్రుడు కిరీటాన్నీ, యముడు రాజదండాన్నీ, బ్రహ్మదేవుడు వేదమయ కవచాన్నీ, ఇతర దేవతలు తమ, తమ స్థాయిల్లో విశేషమైన కానుకలను బహూకరించారు. ఆ వైభోగాలతో పృథు చక్రవర్తి, అతని ధర్మపత్ని అర్చీ సింహాసనంపై రాజఠీవితో భాసిస్తున్నారు.

ఇంతలో వందిమాగధులూ, సూతులూ సభలోకి ప్రవేశించారు. పొగడ్తలే పనిగా పెట్టుకొని పృథు చక్రవర్తిని పరిపరివిధాలా ప్రస్తుతించారు. అయితే ఆ స్తోత్రపాఠాలను ఆలకించి, స్థితప్రజ్ఞుడైన ఆ చక్రవర్తి చిరునవ్వు నవ్వుతూ మేఘగర్జనలాంటి గంభీర కంఠస్వరంతో “వంది మాగధుల్లారా! నాలో సద్గుణాలు ఉంటే మీరు పొగడవచ్చు. కానీ అటువంటివి ఏవీ నాలో లేవు. మీ స్తుతులకు నేను

**అతివిశ్రుతులు సులజ్జా**
**న్వితులు మహోదారు లధిక నిర్మలు లాత్మ**
**స్తుతి పరనిందలు దోషము**
**లతిహేయములని తలంతు రాత్మల నెపుడున్...**

‘ప్రసిద్ధులు, ప్రముఖులు, గొప్పవారు నిర్మల మనస్సూ, లజ్జాభిమానాలూ కలిగి ఉంటారు. ఉదాత్తచిత్తులైనవారు ఆత్మస్తుతి, పరనిందలు దోషమని గుర్తించి అసహ్యించు కుంటార’ని ఉద్ఘాటించారు.

**పొగడ్తలతో ప్రమాదం...:** పొగిడేవారు, పొగిడించు కునేవారు పృథు చక్రవర్తి చెప్పిన ఈ హితవును శ్రద్ధగా అర్థం చేసుకోవాలి. ఎవరికి వారు ఆత్మపరిశీలనతో ఆలోచించుకోవాలి. అయితే మనలో చాలామందికి ఉండే పెద్ద అవలక్షణం తమను తాము ప్రత్యేకంగా అభివర్ణించు కోవడం; ఎదుటివారిలో ఏ చిన్న దోషం కనిపించినా భూతద్దంలో పెట్టి చూపించడం! ఇతరులలో దోషాలు కనుగొనడం సులభం. కానీ తన దోషాల్ని తాను తెలుసుకోవడం చాలా కష్టం. ఎదుటివారి తప్పులను వేలెత్తి చూపించేవారు తమ తప్పులు ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడతారు. ఇతరుల తప్పులను పదిమందికి చెప్పేవారు, తమ తప్పులను ఎవరైనా ఎత్తిచూపిస్తే సహించలేక, కోపంతో ఉద్రేకపడతారు. అయితే ఏ

రంగంలోనైనా అప్పుడప్పుడే ఎదుగుతున్నవారు, అత్యున్నత స్థానాల్లో ఉన్నవారితో సహా అభివృద్ధిలోకి రావాల్సిన వారు ఎవరైనా ఈ దుర్గుణం దరిచేరకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఎదుటివారు మనల్ని ఆకాశానికి ఎత్తేస్తున్న సమయంలో మనం పొంగిపోకుండా నేలమీద నిలబడ డానికే ప్రయత్నించాలి. అందుకే 'పొగడ్త అనేది చెవిటివానికి కూడా వినికిడి శక్తినిస్తుంది. విమర్శ అనేది మాటరాని వ్యక్తిని కూడా మాట్లాడించేలా చేస్తుంది'అంటారు సరదాగా ఓ హాస్యరచయిత.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస వద్దకు యదుమల్లిక్ అనే గొప్ప ధనవంతుడైన వ్యాపారవేత్త వస్తుండేవాడు. అతడు భక్తుడే అయినా, ఎవరైనా పొగిడితే వారి బుట్టలో పడిపోయేవాడు. యదుమల్లిక్‌లోని ఈ బలహీనతను అవకాశంగా తీసుకొని ఎంతోమంది అతనితో సఖ్యతను పెంచుకొని తమ పబ్బం గడుపుకోవడం మొదలుపెట్టారు. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన గురుదేవులు తరచూ ఆయనను హెచ్చరిస్తూనే ఉండేవారు. అయినా అతను ఆ పొగడ్తల మైకంలో పడి వాటిని అంతగా పట్టించుకోలేదు. కొన్నాళ్ళకు ఆ వ్యాపారి వందిమాగధుల ఉచ్చులో పడి పతనమయ్యాడు.

శ్రీరామకృష్ణులు ఓ సందర్భంలో యదుమల్లిక్ గురించి ప్రస్తావిస్తూ భక్తులతో "అంతకు మునుపు యదులో భక్తి ఉండేది. భగవంతుని గురించిన విషయాలు ఒకింత వినేవాడు. కానీ కొందరు పొగడ్తలరాయుళ్ళు సదా అతణ్ణి పరివేష్టించి పూర్తిగా పాడుచేశారు. అందుకే అలాంటి వాళ్ళకు దూరంగా ఉండాలి" అన్నారు. నిజంగా మనస్సులో ఎక్కడో ఆత్మన్యూనతతో ఇబ్బందిపడే వాళ్ళే అభినందనల కోసం అర్రులు చాస్తూ ఉంటారు.

అయితే నిజమైన ప్రజ్ఞాపాటవాలు కలిగినవాళ్ళు ప్రశంసల కోసం పాకులాడరు. పైగా ఎవరు ఎంత పొగడ్తల్లో ముంచెత్తినా ఏమాత్రం చలించరు. ఇలాంటి మహాత్ములనే ఉటంకిస్తూ విదురుడు ప్రాజ్ఞులైన వారు సన్మానాలకు పొంగిపోరన్న భావంతో 'న హృష్యత్యాత్మ సంమానే...' అంటాడు. సంగీత సామ్రాజ్ఞి 'భారతరత్న' ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారే ఇందుకు నిదర్శనం. ఎవరైనా ఆ మధురగాయని వద్దకు వచ్చి ఆరాధనా భావంతో 'అమ్మా! మీరింత అద్భుతంగా ఎలా పాడగలుగుతున్నారు? మీరు పాడుతుంటే మమ్మల్ని మేమే మరచిపోతాం! మీది గంధర్వగానం' అంటే వెంటనే ఆమె చాలా ఇబ్బంది పడిపోతూ బిడియంతో తనదైన మందహాసంతో తలదించు కునేవారట! మరింత అభినందిస్తే 'అంతా ఆ పెరుమాళ్ళ దయ!' అంటూ తన్మయంతో కళ్ళుమూసుకొని ముకుళిత హస్తాలతో ఆ భగవంతుడికి దణ్ణం పెట్టుకునేవారట! అదీ మహానుభావుల వినమ్రత. ఇలాంటి వారిని ఉద్దేశించే కాబోలు పృథు చక్రవర్తి రూపంలో భగవంతుడు 'అతివిశ్రుతులు సులజ్జాన్వితులు...' అన్నది!

**నుతింప తగదు...:** తమ పూర్వవైభవాన్ని గుర్తుచేయడానికి, తాము ఉదాసీనతలో పడిపోకుండా ఉత్సాహపరచడానికి రాజులు ఆనాడు వందిమాగధులను నియమించుకునేవారు. వృత్తిలో భాగంగా వారు ఆయా బాధ్యతలకు న్యాయం చేస్తూ అధినేతలను ఆహ్లాదపరుస్తూ ఉండేవారు. అయితే చాలామంది రాజుల విషయంలో అది పరిమితులను దాటిపోయింది. ప్రశంసల స్థానంలో పొగడ్తలు మొదలయ్యాయి. అది వారి అహంకారానికి ఆజ్యం పోసేలా తయారైంది. ఈ వికృత పరిణామాన్ని ముందే ఊహించిన పృథు చక్రవర్తి...

**మనల్ని మనం గొప్పగా భావించుకోవడం మన దురహంకారం. మరెవరిలోనో లోపాలున్నాయని వేలెత్తి చూపడం మన దృష్టిదోషం. ఈ రెండు అవలక్షణాలూ మన అభ్యున్నతికి అవరోధాలే! మనలో ఏదైనా ప్రత్యేకత ప్రకటితమైతే అది ఆ పరమాత్మ ప్రసాదించిన వరమని గుర్తించి వినమ్రంగా మెలగాలి. ఎవరు ఎంత ఆకాశానికి ఎత్తేస్తున్నా, మన కాళ్ళు నేలపైనే ఉండేటట్లు చూసుకోవాలి. పొగుడుతున్నారు కదా! అని పొంగిపోతే, మన ప్రతిష్ఠ కూడా పాలపొంగులా పొంగి, పొంగి ఎప్పుడో ఒకప్పుడు బుగ్గిపాలవుతుంది.**

**వంది జనంబులు లోకము**
**లందు నవిదిత వరకర్ములగు భూపతులన్**
**నందించు టవశ్యంబై**
**నం దగదు నుతింప శిశుజనంబుల పగిదిన్...**

'ఉత్తమ కార్యాలు ఏవీ చేయకపోయినా లోకంలో రాజులను స్తుతిపాఠకులు స్తుతిస్తూనే ఉంటారు. అయినా మరీ పసిపిల్లలవలె స్తోత్రం చేయడం మంచిపని కాదు' అని హెచ్చరించాడు. ఆ హితవుతో వందిమాగధులు వారి పరిధిలో వారు ఉంటూ ఆయనను అనుసరిస్తూ ఉండేవారు. ఇలా ఆ చక్రవర్తి సంయమనంతో, సమర్థంగా పరిపాలన కొనసాగించాడు. ❖

**గురు ముఖాన విన్న బోధనల గురించి నిత్యం మననం చేయి. అంతేగానీ ఆచార్యులు చెప్పిన బోధలు విని తల ఊపకు. ఊగే తలలోకి ఏ బోధా ఎక్కదు, ఎక్కినా నిలవదు. - *శ్రీరామానుజులు***



స్వామి యతీశ్వరానంద

# మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

- ప్రవ్రాజిక శారదాప్రాణ

ఒకరోజు స్వామీజీ 'ప్రేమ-సానుభూతి కలిగి వుండడం ఆధ్యాత్మిక జీవిత లక్షణం' అనే విషయాన్ని ఇలా చర్చించారు:

ఆధ్యాత్మిక జీవితమనేది భక్తులకు ఇతరులపై సానుభూతిని, సహృదయాన్ని పెంపొందించకపోతే ఆ భక్తికి అర్థమేమున్నది? వ్యక్తిత్వం సక్రమమైన పద్ధతిలో రూపుదిద్దుకొనకపోతే మానవుడు గొప్పవాడు కాగలడా? సరైన వ్యక్తిత్వం లేకపోతే మనం మన కర్తవ్యానికి బదులుగా అధికారానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తాం. మనకు ఎంత లభిస్తుంది అనే దాని మీద ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. మనం ఎంత ఇస్తామో అంతే లభిస్తుంది. దానిలో సందేహం లేదు. ఎవరివద్దా భిక్షకుని వలె చేయిచాచవద్దు. ఎల్లప్పుడు దాత స్థానంలోనే ఉండు.

శ్రీరామకృష్ణుల శిష్యులు క్షణంలో తీవ్రధ్యానమగ్నులయ్యే వారు. వెనువెంటనే ఇతరులకు సహాయపడడానికి వెనుదీసేవారు కాదు. అనేక పనులను చేయడానికి సంసిద్ధమయ్యేవారు.

శ్రీరామకృష్ణుల ఆంతరంగిక అనుచరులు పూర్తిగా భిన్నమైన వ్యక్తులు. భగవంతునిపై వీరికి ఏ విధమైన ప్రేమ ఉండేదో, అదేవిధమైన ప్రేమను సాధారణ మానవులపైన కూడా చూపించేవారు. ఇంకా చెప్పాలంటే మనుష్యులపై ఎంతప్రేమ ఉండేదో, అంతే అనురాగం భగవంతునిపై ఉండేది. స్త్రీ, పురుషులందరిలోను ఆ భగవంతుని చూసేవారు.

గురుమహారాజ్ బిడ్డల పాదపద్మముల చెంత కూర్చున్న మేము 'ఆధ్యాత్మిక జీవితం ఆత్మకేంద్రితం కాదు, అది విశ్వకేంద్రితం' అనే పాఠాన్ని నేర్చుకున్నాం.

మరునాటి ఉదయం స్వామీజీ వద్దకు వెళ్ళినప్పుడు, 'తపస్సుచేయి' అన్నారు. వెంటనే నేను, 'తపస్సు అంటే ఏమిటి?' అని ప్రశ్నించాను. దానికి స్వామీజీ, "తపస్సు అంటే ఆత్మసంయమనం, ఇంద్రియ నిగ్రహం. పురుషులను శ్రీరామకృష్ణులుగాను, స్త్రీలను శారదామాతగాను భావించు. తరువాత శారదా రామకృష్ణులను ఒకే 'సత్'గా అఖండ సచ్చిదానందము నందు లీనమొనరించు" అన్నారు.

మొదట పురుషులందరిని శ్రీరామకృష్ణ జ్యోతిగను, స్త్రీలను శారదామాత జ్యోతిగను దర్శించడం అవసరం. శారీరక-మానసిక బంధమనే అడ్డంకిని, క్షుద్రమైన అహంకార-మమకారాలను తొలగించు. కష్టమనిపిస్తే దానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది మన యందు, ఇతరుల యందు ఒకే ఆత్మ విరాజమానమై వుందనే సత్యాన్ని వివేకంతో అర్థం చేసుకో. రెండవది వివేకమనే కత్తితో 'వాసనలను' నిర్మూలించు. ఇంద్రియ సంయమనమనే తపస్సు చేయి. ఆ సంయమనం అభ్యసిస్తే విషయభోగాలు దరిచేరవు. కానీ, భోగమనే సంస్కారం సూక్ష్మరూపంలో ఉండి తీరుతుంది. దాని వేరు బ్రహ్మజ్ఞానం చేత మాత్రమే నాశనమవుతుంది.

ఇంద్రియాసక్తి మరియు వాసనలు అన్నింటి కంటే పెద్ద శత్రువులు. అందుకోసమే సంయమనంతో కూడిన నియంత్రిత జీవనయాత్రపై నిఘావేసి ఉంచుకోవాలి. భోగవాసనలు మనలో ఉన్నంతకాలం ఆధ్యాత్మిక ఉపదేశాలు ఆచరింపనలవికావు. నీవు అనుకుంటున్నట్లు ఒక్కొక్క వాసనను తొలగించడం అసాధ్యం.

నీ హృదయాన్ని రుద్రభూమి గావించు. ఆ భూమిలో వాసనలు, అసంపూర్ణత, అహంకారం మొదలైన వాటిని కాల్చి బూడిద చేయి. వాసనలతో నిరంతర పోరాటమే తపస్సు. అదే మనం భగవంతునికి సమర్పించ గల అత్యంత శ్రేష్ఠమైన పూజ. వాటిని జయించడమే ఆ పూజాఫలం. ❖ **అనువాదం : శ్రీమతి టి. శారద**

(స్వామి యతీశ్వరానంద - శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహారాజ్ శిష్యులు)

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+May+2017**

* * *